సాక్షి
వికారాబాద్

మంగళవారం । 1 । జూలై । 2025



ప్రతి కార్యకర్తకూ న్యాయం..

కష్టకాలంలో కాంగ్రెస్‌కు అండగా నిలిచిన ప్రతి కార్యకర్తకూ న్యాయం చేస్తామని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



శాంతిభద్రతల పరిరక్షణే..

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీస్ శాఖ ముందుకు సాగుతున్నట్లు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. 8లో▸



వర్షాకాలం పశువులు భద్రం

వర్షాకాలం ప్రారంభమై అడపాదడపా కురుస్తున్న వానలకు మూగ జీవాలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

3న సర్టిఫికెట్ల పరిశీలన



డీఈఓ రేణుకాదేవి

అనంతగిరి: జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 12 పోస్టుల భర్తీలో భాగంగా ఈ నెల 3వ తేదీ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని డీఈఓ రేణుకాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 – 23లో స్పెషల్ ఆఫీసర్, పీజీసీఆర్‌టీ, పీఈటీ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షలో మెరిట్ లిస్టులోని అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 11గంటలకు సంబంధిత ఒరిజినల్స్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని తెలిపారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి




అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సంఘం నాయకులు

దోమ: ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన పరిగి తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం దోమ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిగి మండలం రంగంపల్లి సర్వే నంబర్ 146లో మొత్తం 4.17 గుంటల భూమి ఉందని, అందులోని ఎకరం భూమిని గత నెల 9న ఇతరుల పేరిట అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. ఇదే గ్రామంలోని సర్వే నంబర్ 256లో 20.23 గుంటల భూమి ఆక్రమించేందుకు కొందరు రియల్టర్లు ప్రయత్నిస్తున్నా తహసీల్దార్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నేతలు సత్తయ్య, చెన్నారెడ్డి, వెంకటేశ్, రాములు, ఆనంద్, రాజు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

మొయినాబాద్: ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమనేత దేశమొళ్ల ఆంజనేయులు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మున్సిపల్ కేంద్రంలో ఉద్యమకారులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మర్చిపోయిందని విమర్శించారు. ఉద్యమకారులను మరవద్దనే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు మహిపాల్, నాయకులు కుమ్మరి రమేష్, భిక్షపతి, మధు, అవినాష్, ముకుందరెడ్డి, బన్సీలాల్, రత్నం, కేబుల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మరకత శివాలయం సందర్శన



సినీ నటుడు బాలాజీని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని చెందిప్పలో వెలసిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయాన్ని సోమవారం సినీ నటుడు బాలాజీ దర్శించుకున్నారు. స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మరకత శివాలయం ఎంతో అద్భుతంగా ఉందని, సమయం దొరికినప్పుడల్లా ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నిస్తుంటానని తెలిపారు.

‘చెత్త’ మున్సిపాలిటీలు

కంపుకొడుతున్న కాలనీలు, వీధులు



వికారాబాద్ పట్టణంలో దెబ్బతిన్న మురుగుకాలువ

మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి కంపుకొడుతున్నాయి. కాలువల్లో వ్యర్థాలు చేరి మురుగు ముందుకు కదలడం లేదు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో చెత్త కుళ్లి ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణ తీరుపై ‘సాక్షి’ ప్రత్యేక కథనాలు




పరిగి పట్టణంలోని 5వ వార్డులో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

- ప్రతిపాదనల్లోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు
- జిల్లా కేంద్రంలో పరిస్థితి మరీ అధ్వానం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో ప్రజలు

వికారాబాద్: వికారాబాద్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య మెరుగుకు ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని పాలకులు, అధికారులు చెబుతున్నా కాలనీలు మాత్రం కంపు వీడటం లేదు. రోజూ ఏదో ఒక కాలనీలో మురుగు సమస్య దర్శనమిస్తోంది. చిన్నపాటి వర్షం పడితే చాలు పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. రోడ్లు, వీధులు మురుగు నీటితో నిండిపోతాయి. ప్రజలు నడిచే పరిస్థితి కూడా ఉండదు. వికారాబాద్ నడిబొడ్డున బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదు. అవసరాల మేర మురుగు కాలువలు లేవు. వికారాబాద్ పట్టణ జనాభా దాదాపు 80 వేల వరకు ఉంటుంది. జిల్లా కేంద్రం కావడంతో ఆయా ప్రాంతాల నుంచి వివిధ అవసరాల నిమిత్తం రోజూ 20వేల నుంచి 30వేల మంది ఇక్కడికి వస్తుంటారు. మున్సిపల్ పరిధిలో పది చోట్ల మాత్రమే పబ్లిక్ టాయిలెట్లు ఉ న్నాయి. ప్రస్తుత అవసరాలకు ఇవి సరిపోవ డం లేదు. మరో పదిచోట్ల టాయిలెట్లు నిర్మించాల్సి ఉంది. మున్సిపల్ పరిధిలో 33.50 కిలోమీటర్ల మేర సీసీ డ్రైనేజీ, 3.38 కిలోమీటర్ల రాతి డ్రైనేజీ, మరో ఐదు కిలోమీటర్ల కచ్చా డ్రైనేజీ ఉంది. మరో 40 కిలోమీటర్ల సాధారణ డ్రైనేజీ, 60 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అవసరమని అధికారులు అంచనా వేశారు. పట్టణ అవసరాల మేరకు డ్రైజేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు, పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ లేక పాట్లు



పరిగి: డ్రైనేజీ వ్యవస్థకు నోచుకోని విద్యానగర్ కాలనీ

పరిగి: పరిగి మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా చెత్తాచెదారం కనిపిస్తోంది. కొన్ని కాలనీలకే చెత్త సేకరణ వాహనాలు వస్తుండటంతో మిగిలిన కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విధిలేక ప్రజలు వీధుల్లో, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేస్తున్నారు. పట్టణంలోని 5వ వార్డు, విద్యానగర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, టీచర్స్‌కాలనీ, ఇంద్రనగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ లేదు. దీంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. ఈ నీటిని ఖాళీ ప్లాట్లలోకి మళ్లించారు. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల నుంచి 19 వాహనాలతో రోజుకు 8 టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. 78 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నా చెత్త సేకరణ సరిగ్గా లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చినుకు పడితే చిత్తడే



బూల్కాపూర్‌లో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

కొడంగల్: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పలు గ్రామాల్లో చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. మున్సిపల్‌లో విలీనమైన గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొడంగల్ మేజర్ గ్రామ పంచాయతీకి 2018లో మున్సిపల్ హోదా లభించింది. అప్పట్లో కొండారెడ్డిపల్లి, గుండ్లకుంట, పాత కొడంగల్, పాత కొడంగల్ తండా, బూల్కాపూర్, ఐనన్‌పల్లి గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఈ గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. బూల్కాపూర్‌లో మైసమ్మ దేవాలయానికి వెళ్లే దారిలో మురుగు నీరు రోడ్డుపై నిలుస్తోంది. దీంతో గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి వస్తోంది. బూల్కాపూర్‌లో మురుగు కాల్వలు లేవు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేవు. గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా గ్రామస్తులు బహిర్భూమికి వెళ్తున్నారు. గ్రామంలోకి వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉంది. వర్షాకాలంలో గ్రామంలో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం



తాండూరు పట్టణంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

తాండూరు: తాండూరు మున్సిపల్ పరిధిలో చెత్తసేకరణ అధ్వానంగా మారింది. మున్సిపల్ పాలకవర్గం గడువు ముగియడం.. ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుద్ధ్యంపై పెద్దగా శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకుపోయి డంపింగ్ యార్డులను తలపిస్తోంది. చెత్త సేకరణ వాహనాలు సరిగ్గా రావడం లేదని స్థానికులు తెలిపారు. పట్టణ పరిధిలో మురుగు కాల్వలు సరిగ్గా లేకపోవడంతో వ్యర్థ జలాలు ఎక్కడికక్కడ నిలిచి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారిలో మురుగు కాల్వలు సరిగ్గా లేక మురుగు నీరు రోడ్డుపై నిలుస్తోంది. మున్సిపల్ పరిధిలో 36 వార్డులు 85 వేల జనాభా ఉంది. రోజూ ఇతర ప్రాంతాల నుంచి మరో 30 వేల మంది పట్టణానికి వచ్చి వెళ్తుంటారు. మూత్రశాలలు లేకపోవడంతో ప్రజలు ఖాళీ ప్రదేశాల్లో కానిచ్చేస్తున్నారు. అధికారులు స్పందించి తాండూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



డీఎంహెచ్‌ఓను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఇతర అధికారులు

బాధ్యతగా పనిచేస్తే గుర్తింపు

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- ఉద్యోగ విరమణ పొందిన డీఎంహెచ్‌ఓ, కుల్కచర్ల తహసీల్దార్
- ఘనంగా వీడ్కోలు

అనంతగిరి: నిజాయితీగా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తే జీవితంలో ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం ఉద్యోగ విరమణ పొందుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరవణ, కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్‌ను కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాధ్యతగా పనిచేస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. ప్రజలకు సేవ చేసే భాగ్యం అందరికీ రాదన్నారు. అనంతరం వెంకటరవణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి, డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఉద్యాన వన శాఖ అధికారి మహమ్మద్ సత్తార్, ఏఓ ఫరహీన్ బేగం, నెమత్ హాలీ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి

బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అక్రమ రవాణాకు గురవుతున్న, తప్పిపోయిన పిల్లలను గుర్తించాలని ఆదేశించారు. బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. తప్పిపోయిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించాలన్నారు. మతిస్థిమితం లేని వారిని వారిని పునరావాస కేంద్రాలకు తరలించి వైద్య సేవలు అందించాలని తెలిపారు. పిల్లలను పనుల్లో పెట్టుకోవడం చట్ట రీత్యా నేరమన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం.సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, డీడబ్ల్యూఓ కృష్ణవేణి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటేశం, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ వాల్యా నాయక్, అడిషనల్ ఎస్పీ (డీటీసీ) మురళీధర్, డీసీపీఓ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సత్వరం పరిష్కరించాలి

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నిర్వహించిన ప్రజావాణికి 185 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచరాదని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్‌డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాల్లో జోక్యం వద్దు

- నేరాల అదుపులో సీసీ కెమెరాలదే కీలక పాత్ర
- నవాబుపేట పోలీసుల పనితీరు భేష్
- ఎస్పీ నారాయణరెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

నవాబుపేట: నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం నవాబుపేట పోలీస్ స్టేషన్ ఆయన సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల ముందు, షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చొరవ తీసుకోవాలని సూచించారు. చాలామంది నేరస్తులను సీసీ కెమెరాల ద్వారానే గుర్తిస్తున్నట్లు తెలిపారు. రోడ్ల పరిస్థితి బాగులేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. భూ తగాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోరాదని, రెవెన్యూ శాఖ సూచనల మేరకు ముందుకు వెళ్లాలన్నారు. 80 శాతం దొంగతనాలు, దోపిడీలు, ట్రాన్స్ ఫార్మర్ల చోరీలు పాత నేరస్తుల పనేనని పేర్కొన్నారు. వారిపై నిఘా ఉంచామన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా, నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నవాబుపేట పోలీసుల పనితీరు బాగుందని, ఇంకా మెరుగ్గా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ వెంకటేష్, ఎస్ఐ అరుణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భూ తగాదాలతో వ్యక్తి హత్య

- రాడ్డుతో తలపై మోది దారుణం
- మరొకరికి తీవ్ర గాయాలు



వెంకట్‌నాయక్(ఫైల్)

దౌల్తాబాద్: భూతగాదాలతో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దౌల్తాబాద్ మండలం బండివాడ తండా శివారులో సోమవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులుస్థానికుల కథనం ప్రకారం.. బండివాడ తండా,హన్మానాయక్ తండాలు పక్కనే పక్కనే ఉంటాయి. ఈ రెండు తండాల్లోని బాబునాయక్, విజయ్‌నాయక్‌కు కొన్నేళ్లుగా భూతగాదాలు ఉన్నాయి. ఇరువర్గాల మధ్య ఆదివారం మధ్యాహ్నం గొడవ జరిగింది. విజయ్‌నాయక్ వర్గం బాబు నాయక్ వర్గంపై దాడి చేయడంతో ఐదుమందికి గాయాలయ్యాయి. దీంతో క్షత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాత్రి బాబునాయక్, అతని తమ్ముడు వెంకట్‌నాయక్ మరో వ్యక్తి శ్రీరాంలు బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో విజయ్ వర్గం కాపుకాచి రాడ్డుతో దాడి చేసింది. గాయాలతో బాబునాయక్ తప్పించుకున్నారు. వెంకట్‌నాయక్(38)పై తలపై రాడ్డుతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను చుట్టుపక్కల వారు కొడంగల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దీంతో తండాలో పోలీ సు పికెట్ ఏర్పాటు చేశారు. మృతుడికి ఒక కుమారుడు. ముగ్గురు కూతుర్లు ఉన్నారు. సంఘటన స్థలాన్ని సీఐ శ్రీధరెడ్డి, ఎస్ఐ రవిగౌడ్ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పారదర్శకంగా పదవుల పంపిణీ

- నామినేటెడ్, పార్టీ పదవుల్లో సీనియర్లకు ప్రాధాన్యం
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి
- అర్హులకు పథకాలు అందేలా చూస్తాం
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



నాయకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రాష్ట్ర పరిశీలకులు

బషీరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలలోపు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తామని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా గ్రామ, మండల, డివిజన్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం బషీరాబాద్‌లో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పరిశీలకులు వినోద్‌రెడ్డి, నరేందర్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవులు ఆశించే నాయకులు వివరాలు ఇవ్వాలని సూచించారు. జిల్లాకు రెండు రాష్ట్రస్థాయి డైరెక్టర్ పదవులతో పాటు గ్రామ, మండల, డివిజన్ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

అన్యాయం జరగనివ్వం: మనోహర్‌రెడ్డి

పార్టీలో చాలా కాలంగా పనిచేస్తున్న సీనియర్ నాయకులకు పదవుల పంపిణీలో అన్యాయం జరగనివ్వమని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. 2017 కంటే ముందు నుంచి ఉన్నవారికి ముఖ్యమైన పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎక్మాయిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో జరిగిన అక్రమాలపై విచారణ జరిపామని త్వరలో చర్యలు ఉంటాయని తెలిపారు.

కొత్త వారిదే పెత్తనం: రమేష్ మహరాజ్

అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ నుంచి పార్టీలో చేరిన నాయకులు పెత్తనం చెలాయిస్తున్నారని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేష్ మహరాజ్ ఆరోపించారు.తాను నాలుగేళ్లుగా పార్టీలో పని చేస్తున్నానని, మీరంతా రెండేళ్ల కిందట వచ్చారంటూ ఎమ్మెల్యేను ఉద్దేశించి అనడంతో సమావేశంలో గందరగోళం ఏర్పడింది. ఇందిరమ్మ కమిటీల్లోనూ సీనియర్లకు చోటు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కలాల్ నర్సింలు, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, సీనియర్ నాయకులు వెంకటేశ్ మహరాజ్, శంకరప్ప, రామ్ నాయక్, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, శాంతిభాయి, తలారి సురేష్, అనిల్ కుమార్, సతీష్, మాణిక్‌రావు పాల్గొన్నారు.

పాతవారికే పదవులు

తాండూరు రూరల్: 2017 కంటే ముందు నుంచి పార్టీలో ఉన్న నేతలకే పదవులు ఇస్తామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ శివారులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో తాండూరు అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చందులు పాల్గొన్నారు.

మెడికల్ కౌన్సిల్ దాడులు

- అనుమతులు లేని ఆస్పత్రులపై కొరడా
- తనిఖీల్లో పట్టుబడ్డ నకిలీ వైద్యులు



క్లినిక్‌లో తనిఖీలు నిర్వహించిన బృందం

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ విభాగాల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. విద్యార్హతలు అసలే లేవు. అయినా వైద్యులుగా చలామణి అవుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కాంపౌండర్లపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు కొరడా ఝులిపించారు. సోమవారం షాబాద్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన వైద్యుల బృందం ఏడు క్లినిక్‌లపై కేసులు నమోదు చేసింది. ఓం సాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, శ్రావణ్ ఫస్ట్‌ఎయిడ్ ఎంటర్, మధు శ్రీ క్లినిక్, ముస్తాఫా క్లినిక్, మాస్టర్ క్లినిక్, శ్రీ సాయితిని, జంజం క్లినిక్‌లకు అనుమతులు లేవని గుర్తించింది. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డా.మహేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మీడియాకు వివరాలు వెల్లడించారు. జంజం క్లినిక్‌లో వందల సంఖ్యలో డైకోఫెన్స్ సోడియం ఇంజక్షన్లు, కాల్షియం గ్లూకోనేట్ ఇంజక్షన్లు, స్టెరాయిడ్స్, యాంటీబయాటిక్ ఇంజక్షన్లు గుర్తించినట్టు తెలిపారు. కనీస అర్హత లేకుండా అల్లోపతి దవాఖానా నిర్వహిస్తున్నారని అన్నారు. రోగంతో సంబంధం లేకుండా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, మాత్రలను అధిక మోతాదులో ఇస్తున్నారని పేర్కొన్నారు. చట్ట ప్రకారం ఎంబీబీఎస్ వైద్యులు మాత్రమే మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ చేయించుకుని ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుందన్నారు. అర్హత లేని వ్యక్తులు వైద్యం చేసినట్టైతే ఎన్ఎంసీ చట్టం 34, 35 ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు రూ.5 లక్షల జరిమానా, ఏడాది జైలు శిక్షణ విధిస్తామని వెల్లడించారు. మెడికల్ స్టోర్స్‌లో క్వాలిఫైడ్ వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా, ఫార్మసిస్టులు లేకుండా యాంటిబయాటిక్స్, స్టేరాయిడ్, ఇతర షెడ్యూల్ డ్రగ్స్ విక్రయిస్తునట్టు గుర్తించామని తెలిపారు.

క్లుప్తంగా

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

డీసీసీ ప్రధానకార్యదర్శి హన్మంత్ ముదిరాజ్



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

పరిగి: డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామంటూ గత ప్రభుత్వం పేదలను మోసం చేసిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంత్ ముదిరాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని నస్కల్‌లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేసి ఇంటి నిర్మాణ పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, అశోక్, శ్రీనివాస్, చంద్రయ్య, నరేశ్, అశోక్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొంటాం

అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్



సీడీపీఓ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

అనంతగిరి: ఈ నెల 9న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఈ సమ్మెలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పాల్గొంటుందని తెలుపుతూ వికారాబాద్ సీడీపీఓ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వనజ, అరుణ, పుష్ప, ఆండాలు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ



నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ రుద్రమూర్తి

తాండూరు రూరల్: ప్రతి రైతుకు ఆధార్ తరహాలో ఫార్మర్ రిజిస్ట్రీ గుర్తింపు నంబర్ ఉండాలని వ్యవసాయశాఖ తాండూరు డివిజన్ ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. సోమవారం మండలంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని ఏఓ కొమరయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ తీసుకొని సంబంధిత ఏఈవోల వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. రైతుల వివరాలను ఒకే చోట డిజిటల్‌గా భద్రపరిచి, పథకాల అమలును మరింత సమర్థవంతంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఫార్మర్ రిజిస్ట్రీ చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతా ఆన్‌లైన్!

బయోమెట్రిక్‌తో అధికారుల హాజరు నమోదు

- పారదర్శకత కోసం ప్రత్యేక కార్యాచరణ
- ముందుగా కలెక్టరేట్‌లో అమలు
- వైద్య, విద్యా శాఖల్లోనూ పైలెట్ ప్రాజెక్టు ఎంపిక



గతంలో వినియోగించిన బయోమెట్రిక్ మిషన్

వికారాబాద్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి ఆన్‌లైన్ అటెండెన్స్ సిస్టం అమలు చేయనున్నారు. ప్రభుత్వ యంత్రాంగం విధులకు హాజరుకావటంలో పారదర్శకతకు ఈ విధానం అమలు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపుతుండగా అమలుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ముందుగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని అన్ని శాఖల హెచ్‌ఓడీ కార్యాలయాల నుంచే ఈ విధానం మొదలు పెట్టనున్నారు. కలెక్టరేట్‌లో ఆన్‌లైన్ హాజరు విధానం అమలు కానుంది. అనంతరం ఆరోగ్య, విద్యాశాఖల్లో సైతం ఏర్పాటుకు నిర్ణయించారు. హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో జిల్లాలో 24 పీహెచ్‌సీలు ఉండగా రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. విద్యాశాఖ పరిధిలో 1,063 పాఠశాలలు ఉండగా ముందుగా వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్నెపల్లి పాఠశాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నారు. వారం రోజుల్లో ఎంప్లాయి ఐడీలతో పాటు వారి ఆధార్ నంబర్‌లు సేకరించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో మొత్తం 6,500 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

పర్యవేక్షణ ఉంటేనే ఫలితం

గత కలెక్టర్ నారాయణరెడ్డి హయాంలో జిల్లాలో మొదటిసారి జీఓ అటెండెన్స్ పేరుతో ఆన్‌లైన్ హాజరు విధానం అమలు చేశారు. ఆయన బదిలీపై వెళ్లిపోయాక బయోమెట్రిక్, ఆన్‌లైన్ అటెండెన్స్ విధానానికి స్వస్తి పలికారు. విధి నిర్వహణ, రోజువారీ హాజరులో పారదర్శకత కొరవడిన విషయం గమనించిన ప్రస్తుత కలెక్టర్ ప్రతీక్‌జైన్ తిరిగి ఆన్‌లైన్ విధానం అమలు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం మొబైల్ యాప్ ద్వారా ఈ ఆన్‌లైన్ హాజరు విధానం అమలు చేయనున్నారు. అయితే గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని నెల వారీ పర్యవేక్షణ ఉంటేనే సక్సెస్ అవుతుందని అంచనా వేశారు. గతంలో ఎన్ని రోజులు విధులకు హాజరయ్యారు...? ఎన్ని రోజులు ఆలస్యంగా వచ్చారు...? వారిని గుర్తించి.. శాఖాపరమైన చర్యలు తీసుకోలేదు. దీంతో ఆన్‌లైన్ హాజరును ఉద్యోగులు లైట్ తీసుకున్నారు.

మూణ్నాళ్ల ముచ్చటగా

యంత్రాంగంలో ఎక్కువ మంది ఉద్యోగులతో నడిచే వైద్య, విద్యా శాఖల్లో ఐదారు ఏళ్ల క్రితమే బయోమెట్రిక్ విధానం అమలు చేశారు. రోజువారీ హాజరు పర్యవేక్షణ కోసం ప్రభుత్వం పాఠశాలల్లో మార్పును ఆశించి ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ విధానం మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. ఇప్పటికే కళాశాలలు, గురుకుల పాఠశాలలు తదితర సంస్థలోల బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నారు. సర్కారు 2018లో ఆస్పత్రులతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మిషన్లు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద ముందుగా 10 జిల్లాలను తీసుకోగా అందులో వికారాబాద్ జిల్లా కూడా ఉంది. ప్రయోగాత్మక కార్యక్రమం విజయవంతం కావటంతో ఆరు నెలల తరువాత ఇదే విధానం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేశారు. ఆ సమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు మెరుగు పడిందని అధికారులు పేర్కొన్నారు. అయితే కొద్ది రోజులకే చిన్న చిన్న సాకుగా చూపి బయోమెట్రిక్ మిషన్లు మూలన పడేశారు.

ప్రతీ కార్యకర్తకు న్యాయం చేస్తాం



మండల అధ్యక్ష స్థానానికి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న రామ్మోహన్‌రెడ్డి తదితరులు

డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

యాలాల: కష్టకాలంలో కాంగ్రెస్‌కు అండగా నిలిచిన ప్రతీ కార్యకర్తకు, నాయకులకు తగిన పదవి ఇచ్చి న్యాయం చేస్తామని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి, ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేశ్‌మహరాజ్, అధికార ప్రతినిధి నరేందర్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు పాత, కొత్త తేడా లేకుండా పనిచేయాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు సూచించిన వారికే ఎంపీటీసీ, సర్పంచ్ టిక్కెట్లు ఇస్తామన్నారు. ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించే బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. అనంతరం పార్టీ కమిటీల్లో భాగంగా పదవులను ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ అధ్యక్షుడు భీమప్ప, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, మధుసూదనరెడ్డి, బస్వరాజ్, భీమప్ప, ఏఎంసీ డైరెక్టర్లు నర్సింలుగౌడ్, రాజు, మొగులయ్య, శ్రీనివాస్, నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, అమృతప్ప, సత్యనారాయణరెడ్డి, రవినాయక్ తదితరులు ఉన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



రవిని పరామర్శిస్తున్న నాయకులు

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు

యాలాల: మండల పరిధిలోని హాజీపూర్ గ్రామానికి చెందిన దళిత కౌలు రైతుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు డిమాండ్ చేశారు. సోమవారం హాజీపూర్ గ్రామానికి కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్యతో కలిసి బాధిత రైతును పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోరేపల్లికి చెందిన కోటం శ్రీనివాస్‌కు చెందిన పొలాన్ని ఏడేళ్లుగా రవి కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటున్నాడన్నారు. గత నెల 17న పొలంలో విత్తనాలు వేస్తుండగా అదే గ్రామానికి చెందిన కోటం విష్ణు, పకీరప్పలు మరో 18 మందితో కలిసి రవిపై దాడి చేసి హత్యాయత్నానికి యత్నించారని వివరించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసిన నిందితులను అరెస్టు చేయలేదన్నారు. దళిత రైతుపై దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని.. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, గ్రామస్తులు పాష, మహిపాల్ తదితరులు ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు



ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు టౌన్: శాంతి భద్రతల పరిరక్షణే తమ ధ్యేయమని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ టీం కవాతు నిర్వహించింది. పట్టణంలోని ఆలయాలు, మజీదులు, పురవీధుల మీదుగా కవాతు కొనసాగింది. డీఎస్పీ వెంట సీఐ సంతోశ్‌కుమార్ తదితరులున్నారు.

ఎస్‌ఐ మహిపాల్ రెడ్డి సేవలు అభినందనీయం

తాండూరు పట్టణ ఎస్‌ఐ మహిపాల్ రెడ్డి సేవలు అభినందనీయమని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. పట్టణ ఎస్సైగా విధులు నిర్వర్తించి సోమవారం పదవీ విరమణ పొందిన మహిపాల్ రెడ్డిని డీఎస్పీ తన కార్యాలయంలో సన్మానించారు. 1984లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన మహిపాల్ రెడ్డి ఏఎస్‌ఐగా, ఎస్‌ఐగా పదోన్నతి సాధించారు. జిల్లాలోని బషీరాబాద్, బంట్వారం, తాండూరు పట్టణంతో పాటు సంగారెడ్డి జిల్లాలోనూ ఆయన ఎస్‌ఐగా విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. కానిస్టేబుల్‌గా ఉద్యోగాన్ని సాధించి, ఎస్‌ఐగా రిటైర్డ్ అయిన మహిపాల్ రెడ్డి విధుల పట్ల అంకితభావంతో ఉండేవారన్నారు. పోలీసు శాఖలో సుదీర్ఘంగా ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. ఏ ఉద్యోగికైనా పదవీ విరమణ తప్పదన్నారు. అనంతరం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ 41 ఏళ్ల పాటు పోలీసు శాఖలో ఉంటూ ప్రజలకు విధుల పరంగా సహాయ సహకారాలు అందించానన్నారు. తన ఉద్యోగ కాలంలో సహకరించిన ఉన్నతాధికారులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ సంతోశ్ కుమార్, ఎస్‌ఐ సాజిద్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



మృత్యుంజయస్వామి దంపతులను సన్మానిస్తున్న రవిగౌడ్, పీఆర్టీయూ నాయకులు

- డీసీసీబీ వైస్ చైర్మన్ సంగెం రవిగౌడ్
- ఘనంగా మృత్యుంజయస్వామి పదవీవిరమణ కార్యక్రమం

తాండూరు రూరల్: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని డీసీసీబీ వైస్ చైర్మన్ సంగెం రవిగౌడ్ అన్నారు. సోమవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో మండల పరిధిలోని జినుగుర్తి జెడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం మృత్యుంజయస్వామి పదవీవిరమణ కార్యక్రమాన్ని ఆర్యవైశ్య ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేశక్తి ఉపాధ్యాయుడికే ఉంటుందన్నారు. బడి లేని ఊరు ఉంటుందేమోకాని ఉపాధ్యాయుడు లేని ఊరు ఉండదన్నారు. 38 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన గొప్ప వ్యక్తి మృత్యుంజయస్వామి అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్, అమర్‌నాథ్, గౌరవ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, ఏంఈఓ వెంకటయ్య, తాండూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు వినోద్‌కుమార్, పురుషోత్తంరెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి, నాగప్ప, కిష్టప్ప, అంబమ్మ, రాంనర్సింహారెడ్డి, ప్రభు, బాల్‌రాజ్, రాజేశ్వర్, శ్రీధర్, సతీశ్ తదితరులు ఉన్నారు.

ఆటో నుంచి కిందపడి వ్యక్తి మృతి



మహ్మద్‌అలీ (ఫైల్)

కొడంగల్ రూరల్: ఆటో నుంచి కింద పడిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చిట్లపల్లి టోల్‌ప్లాజా దగ్గర చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన మహ్మద్‌అలీ(65) తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. సోమవారం మొహరం(పీర్ల పండగ) సంతాప దినాలను పురస్కరించుకొని స్వగ్రామానికి బయలుదేరారు. నగరం నుంచి కొడంగల్ చేరాక, ఇక్కడి నుంచి రుద్రారానికి ఆటోలో వెళ్లారు. మార్గమధ్యలో చిట్లపల్లి టోల్ ప్లాజా సమీపంలో స్పీడ్ బ్రేకర్ దాటుతున్న క్రమంలో అకస్మాత్తుగా మహ్మద్‌అలీ ఆటోలో నుంచి జారి కింద పడ్డారు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయన్ని చికిత్స నిమిత్తం కొడంగల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు యూసుఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

మట్టి దందా నిలిపివేత

దోమ: మల్లేపల్లితండా, దాదాపూర్ గ్రామాల సమీపంలో కొన్ని రోజులుగా కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా కొనసాగుతున్న మట్టి దందాను రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. శనివారం ×సాక్షి°దినపత్రికలో ×తోడేస్తున్నారు°అనే కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన రెవన్యూ అధికారులు సోమవారం ఘటనా స్థలికి చేరుకుని తవ్వకాలను నిలిపివేసే చర్యలు చేపట్టారు. వాహనాలను వదిలేసి, ఎలాంటి ఫెనాల్టీలు విధించనట్లు సమాచారం. అక్రమార్కులపై తహసీల్దార్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

పాఠశాల సమయానికి బస్సులు నడిపించాలి

కొడంగల్ రూరల్: పాఠశాలల సమయానికి బస్సులను నడిపించాలని ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. తాండూరు ఆర్టీసీ డిపో అధికారులకు బస్సులను పాఠశాలల సమయానికి నడిపించాలని కోరినట్లు ఆయన తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8.45గంటలకు కొడంగల్‌కు బస్సులు చేరేటట్లు చర్యలు తీసుకోవాలని, కొడంగల్ నుంచి సాయంత్రం 4.40గంటలకు తిరుగు ప్రయాణం అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని కోరినట్లు కోరారు.

విదేశీ వస్తువులను బహిష్కరించాలి



పరిగి: స్వదేశీ జాగరణ మంచ్‌లో విద్యార్థులు తదితరులు

పరిగి/కుల్కచర్ల: విదేశీ వస్తువులను బహిష్కరించాలని స్వదేశీ జాగరన్ మంచ్ రాష్ట్ర నాయకుడు, ప్రముఖ వక్త బెంగాల్ ఈశ్వర్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో స్వదేశీ జాగరన్ మంచ్ ఆధ్వర్యంలో శ్రీసాయి ఒకేషనల్ కళాశాలలో స్వదేశీ వస్తువుల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. నేడు దేశంలో స్వదేశీ అనేది ఒక ఉద్యమంలా సాగాలని సూచించారు. విదేశీ వ్యాపార సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తదితర వాటిలో వస్తువులు కొనుగోలు చేయొద్దని సూచించారు. ఈ కామర్స్ వల్ల దేశంలోని 3 లక్షలకు పైగా చిన్న చిన్న దుకాణాదారులు రోడ్డున పడ్డారన్నారు. మన సాంస్కృతిక సంప్రదాయాలను మనమే కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో విభాగ్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ రాముయాదవ్, ప్రిన్సిపాల్ శ్రీశైలం, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కుల్కచర్ల మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో స్వదేశీ జాగరణ మంచ్ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

హకీంపేట్‌లో ఇంటర్ కళాశాల ప్రారంభోత్సవం



కళాశాలను ప్రారంభిస్తున్న శంకర్ నాయక్, నాయకులు

దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేటలో ఇంటర్ కళాశాలను మంజూరు చేయడం వికారాబాద్, నారాయణపేట జిల్లా విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి శంకర్‌నాయక్ సూచించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని హకీంపేట్‌లో నూతనంగా మంజూరైన ఇంటర్ కళాశాలను ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో హకీంపేట అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతున్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు అందించారు. ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే 80 మంది విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్లు తీసుకున్నారని చెప్పారు. దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ కళాశాల్లో అడ్మిషన్లు లేక రెండేళ్లుగా కళాశాలలు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, గోశాల యజమాని కృష్ణ స్వామి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు ఆంజనేయులు యాదవ్, శ్రీనివాస్, దాసు, యాదయ్య, మహేశ్, గోవర్ధన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ భూ రిజిస్ట్రేషన్ రద్దు

వివరాలను వెల్లడించిన ఆర్డీఓ సరిత

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామంలో చోటు చేసుకున్న రూ.7 కోట్ల అక్రమ భూ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై ప్రభుత్వం, అధికారులు స్పందించారు. భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తున్నట్లు సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని ఆర్డీఓ సరిత వివరించారు. పట్టాదారుకు తెలియకుండా జరిగిన భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై తహసీల్దారు పార్థసారథి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకోని వివరాలను సేకరించారు. అక్రమ భూ రిజిస్ట్రేషన్‌పై స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ సరిత ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు తయారు చేసిన నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. రెవెన్యూ అధికారుల నివేదికను పరిశీలించిన కలెక్టర్ నారాయణరెడ్డి అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేశారని ఆర్డీఓ సరిత వివరించారు. చిల్కమర్రి భూ వ్యవహారంలో అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయడంతో పట్టాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ భూ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం.

18 లీటర్ల సారా పట్టివేత

ఆటో సీజ్, ఒకరి అరెస్టు



పట్టుబడిన సారా, నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్, సిబ్బంది

ఆమనగల్లు: పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 18 లీటర్ల నాటుసార సీజ్ చేసి ఒకరిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్ చౌహాన్ తెలిపిన ప్రకారం.. వెల్దండ మండలం పోచమ్మగడ్డ తండా నుంచి మాడ్గుల మండలం కలకొండ గ్రామానికి నాటుసారా తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు సీఐ బద్యానాద్ చౌహాన్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. పోచమ్మగడ్డ తండా నుంచి కలకొండకు ప్రయాణిస్తున్న ఆటోను తనిఖీ చేయగా అందులో తొమ్మిది ప్లాస్టిక్ బాటిల్స్‌లో 18 లీటర్ల సారా పట్టుబడింది. సారా, ఆటోను సీజ్ చేసి సారా తరలిస్తున్న పాండును అరెస్టు చేశారు. ఈ తనిఖీలో ఎక్సైజ్ ఎస్‌ఐ అరుణ్‌కుమార్, సిబ్బంది శంకర్, దశరథ్, శ్రీను, బాబు, ఆమని, శ్రీజ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



అనిత (ఫైల్)

దుద్యాల్: తమ కూతురుతో కలిసి స్కూటీపై వెళ్తున్న దంపతులను లారీ ఢీకొట్టిన ఘటనలో మరొకరు మృతి చెందారు. వివరాలు.. ఈ నెల 25న కోస్గికి చెందిన వెంకటేశ్, అనిత దంపతులు తమ మూడేళ్ల కూతురు అక్షితతో కలిసి కొడంగల్ వెళ్తుండగా.. దుద్యాల్ గేట్ వద్ద ఓ లారీ అదుపుతప్పి వీరి స్కూటీని ఢీకొట్టింది. దీంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందగా దంపతులను నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అనిత పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందింది. వెంకటేశ్ పరిస్థితి కూడా విషమంగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం కోస్గిలో అనిత అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సమాచారం. కాగా ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు సోమవారం కొడంగల్ ఠాణాకు తరలించారు.